# * వాచీ-పేచీ *

**• మహేశ్వర్ •**

ముసలాడు పోయేడన్నాడు-'అందొచ్చిన యిద్దరు కొడుకులు, కోడళ్ళ చేతిమీదుగా వెళిపోయేడు—అదృష్టవంతుడు' అన్నారు బంధుమిత్రులు.

ఎత్తిపోతలసాడే ఆస్తి పంపకం చెయ్యాలని పెంటపెట్టేడు చిన్నబ్బాయ్ భానోజీ.

తగుమనుషులొచ్చి ఆస్తి పరిష్కారం చేసేరు--చరస్థిరాస్తులు చెరో 5 వేలూ పంచుకున్నారు.

కాని ముసలాడి చక్కని బంగారుగొలుసు జేబువాచీ ఒకటుంది-అది అమ్మి ఒంతులు తెగ్గొట్టుకోటానికి ఆ అన్నదమ్ములకి మనస్కరించలేదు.

భానుకి అన్న లక్ష్మీకాంతం అంటే యెంతో ప్రేమా, భక్తీ.

'అన్నాయ్-వాచీ నీదగ్గరే వుండనీ-నాకు జేబు వాచీ సరదాలేదు-' అన్నాడు భానోజీ.

తమ్ముడిభక్తికీ, వినయానికీ లోన మెచ్చుకున్నాడు లక్ష్మీకాంతం. కాని యెత్తిపోతలు కాకుండానే ఆస్తిపాస్తులు పరిష్కరించుకోడం—తండ్రి పోయినకన్న యెక్కువగా దుఃఖించేడు.

దినవారాలు పూర్తయినాయి-లక్ష్మీపతి భార్యాసమేతంగా ఓ పల్లెటిగ్రామానికి పోయేడు--భాను ఒంతులో మిగిలిన తండ్రియింట్లోనే వుండిపోయేడు.

రెండేళ్ళు సుఖప్రదంగా గడిచినాయ్-ఇహా ఆ ఏకోదరులమధ్య ఆ వాచీ పెద్ద వైరుధ్యాన్ని కల్పించబోతూంది.

ఓనాడు అకస్మాత్తుగా లేచింది భానోజీభార్య.

'ఇంట్లో ఓ మొగపిల్లాడుపుడితే ఓముద్దూ, ముచ్చటా, వుండక్కర్లేదా? చక్కదనాల వాచీ-అన్నగారికి త్యాగంచేసి చేతులు ముడుచుకూర్చున్నారు-ఒంతుప్రకారం సంగోరుఖరీదుపారేసి వాచీ తెప్పించండి-' అని పోరు ప్రారంభించింది.

వాచీకేకాదు-మరి దేనికైనా, అన్నతో తగవులాట భానుకి మొదట్నుండీ యిష్టంలేదు.

'నీవాచీ మండినట్టేవుంది--దానికోసం మా అన్నని రచ్చకీడ్చి మేం బుర్రలు పగలకొట్టుకుంటే నీకు ఆనందంగా వుంటుంది-!!' అన్నాడు భార్యతో.

'వాచీ అడిగినమాత్రాన బుర్రలు పగలకొట్టుకోవాల్సిన అగత్యం యెక్కడుంది.ఎవరిఆశలు వాళ్ళవి—మరి కొన్నాళ్ళుపోతే అది కాస్త కాల్దోషం పట్టిపోతుంది-'

అని రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది.

ఇహ వాచీ తెప్పించి యింట్లో పెడితే నేగాని భార్యతో పొత్తుకుదరదు. తెల్లారిలేస్తే వేధింపులు శాపనార్థాలూ, భానోజీని పిచ్చెత్తించేయ్.

వాచీ వెంటనే ఖరీదుకట్టించి సంగోరుసామ్ముకి వి. పి. చెయ్యమని అన్నగారికి వుత్తరం వ్రాశాడు.

ససేమిరా జవాబురాలేదు-దాంతో భానోజీకి వేడిపుట్టింది-భార్యావుపదేశాలు బాగా పనిచెయ్యనారంభించేయ్-వాచీ యెగేసే వుద్దేశంతోనే వుత్తరానికి జవాబైనా వ్రాశాడుకాడు-అని నిశ్చయించేడు.

'త్యాగమూర్తులు ఆ గోల్డువాచీకితగిన బ్లేజరు కోటు-అన్నగారికి అర్పణంచేసిరండి-' అంటూ కోటం దిచ్చింది ఆవేళ- భానోజీ వుగ్రుడైనాడు.

'వాచీవ్యవహారం పరిష్కరించకపోతే-నీకూ, నాకూ, ఒక్క స్నానంతోసరి— నేను కోర్టెక్కను— ఇవాళతో నీకూ నాకూ సర్వబంధాలు తెగిపోయేయ్-'

అంటూ ఓ లేఖరాశాడు-దానికీ జవాబులేదు.

'ఎంతైనా గడుసువాళ్ళు-అందరూ మీలాంటి తెలివిహీనులేవుంటే ప్రపంచం అడుక్కుతిన్ను-' అంది భానోజీ శౌర్యపత్ని.

ఆనాడు రాత్రిబండీకి బయల్దేరి అన్నగారితో తెగతెంపులు చేసుకోటాన్ని నిశ్చయించేడు భానోజీ.

ఉదయాన్నే ఓ వుత్తరం అందింది-అది అన్న వ్రాసిందికాదు.

ఒదిన కాత్యాయని వ్రాసింది.

'భానూ!

మీ అన్నకి చాలా సుస్తీగావుంది. నీమీదే మనసు పెట్టుకునివున్నారు. నేను ఓపలేనిదాన్ని-ఈ ఉత్తరం టెలిగ్రాంగా భావించి వెంటనేరావాలి.

ఆశీర్వచనాలతో నీ ఒదిన
కాత్యాయని-'

చచ్చినావెళ్లను పొమ్మన్నాడు. 'ఏమిటండీ ఆ మూర్ఖప్పట్టు-ఓవేళ మీ అన్నగార్కి యెట్నుంచే దొచ్చినా వాచీ అన్యాక్రాంతం కాకమానదు-లేదా యీలోగా మీ ఒదినగారే లక్కికిలిక్కిచేసి నాకు తెలీదని దమాయించనూ ఒచ్చు-' అని అంటించి వెళ్లిపోయింది.

రాత్రి భానోజీప్రయాణం స్థిరపడిపోయింది.

అన్నగారివాకిట్లో కాలుపెట్టేసరికి యిల్లు గొల్లుమంది-యింకేముంది లక్ష్మీపతి: కాత్యాయని పసుపుకుంకం మంటగలిపేడు--లక్ష్మీపతి దినవారాలన్నీ సక్రమంగా జరిగినట్టే-పదినాడు కాత్యాయని బలువుపడింది-చక్కని మొగపిల్లాడుపుట్టేడు.

ఆయింట ఒక జ్యోతివెలిగింది-కాని కాత్యాయిని విచారంమాత్రం తీరలేదు.

భానోజీపెళ్ళానికి టెలిగ్రాంయిచ్చి తెప్పించేడు. ఇంట్లో యింత దుఃఖపుగంజీపోసేవాళ్ళైనా లేరని- నెలపురుడు తీరగనే భానోజీ ఒదిన గార్ని కదిపాడు-వాచీవిషయమై—

'భానూ-దౌర్భాగ్యురాల్ని-మీ అన్ననీ నిన్నూ దూరంచేసేను-నువ్వు వాచీవిషయమై వ్రాసిన వుత్తరం ఒక్కటీ మీ అన్నగారు చూడలేదు-వాచీమీదగల వ్యామోహంచేత ఆ ఉత్తరాలన్నీ దాచేసేను-లేకపోతే ఆయన యేనాడో యీ వాచీ నీకు పంపివుందురు-'

అంటూ బీరువాతీసి బంగారపుగొలుసూ వాచీ భానోజీ చేతులోవుంచింది-భాను నిలువునా కంపించిపోయేడు-'అన్నాయ్-నన్ను క్షమించు-' అనిమాత్రం అనగల్గేడు-ఆమర్నాడు భార్యాసమేతంగా భానోజీ యింటికి తిరిగొచ్చేసేడు.

వారంరోజులు తిరిగిపోయేయ్--వాచీగొలుసు చెరిపించి చక్కని మెడగొలుసు చేయించేడు.

'ఒదినా!

ఇందుతో మీకో బంగారుగొలుసు పంపుతున్నాను. నా ముద్దులపాపకిది చిన్నకానుక-మీ ముఖంచూడ సాహసించలేను—పరలోకంనుండి అన్నయ్య ఆశీర్వాదాలు పొందుతామనే ఆశ.

మీ భాను-'